నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

1

సోమవారం | అక్టోబర్ 07 . 2024 | www.navatelangana.com

సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

నవతెలంగాణ-నకిరేకల్



తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం యునైటెడ్ కింగ్ డమ్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో లండన్ లోని దాగ్గేనంలో బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అందరూ ఒక్క చోట కలిసి పూలను పూజించి, పండుగ చేసుకోవడమే బతుకమ్మ అన్నారు.విదేశాల్లో ఉన్నప్పటికి తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతున్న తీరు చాల గొప్పదన్నారు. .ఇక్కడకు వచ్చి బతుకమ్మ వేడుకలో పాల్గొన్నందుకు చాల సంతోషంగా ఉందన్నారు.

'ఎమ్మెల్యే మందుల సామేల్ పై అసత్య ఆరోపణలు సరికాదు'

నవతెలంగాణ-శాలిగౌరారం

తుంగతుర్తి నియోజకవర్గంలోని పలువురు ఎమ్మెల్యే మందుల సామెల్‌పై అదే పనిగా అనవసరమైన ఆరోపణలు చేయడం సరికాదు అని కాంగ్రెస్ నాయకులు భూపతి వెంకన్న అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను చూసి ఓర్వలేక కొంతమంద అసత్య ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్‌ని విచ్ఛిన్నం చేసే పనిలో నిమగ్నమయ్యారన్నారు. నియోజకవర్గంలో ఇసుక రవాణాకు ఎమ్మెల్యేకు ఇలాంటి సంబంధం లేదని, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిలిపివేశారని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఎమ్మెల్యేపై అసత్యమన ఆరోపణలు మానుకోవాలన్నారు. లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లకు.. ఐరీస్..!

వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పలుమార్పులు చేసింది. అక్రమాలను అరికట్టేందుకు నూతనంగా ఐరీస్ విధానం ప్రవేశపెట్టింది. ఈసారి సన్నధాన్యానికి దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్న నేపథ్యంలో... సన్న, దొడ్డు రకం ధాన్యం నిర్ధారణ బాధ్యతలను ఏఈఓలకు అప్పగించింది. కాగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



- కనుపాప నిర్ధారణతో ధాన్యం సేకరణ
- జిల్లాలో 375 కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం
- ఏర్పాట్లపై అధికారుల ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కాగా ధాన్యాన్ని విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సిందే. ధాన్యం కాంటా పెట్టిన తర్వాత రైతుల ఐరీస్ తీసుకుంటారు. అనంతరం వివరాలను ట్యాబ్లో నమోదుచేస్తారు. రైతులు కేంద్రాలకు రాకపోతే ధాన్యం కొనుగోలు చేయరు. ఈ విధానం ద్వారా కొనుగోళ్లలో అక్రమాలకు తావుండదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. కాగా జిల్లా అధికారులు మాత్రం ఐరీస్ పెట్టమని పూర్తిస్థాయిగా ఆదేశాలు రావాల్సి ఉందని పేర్కొంటున్నారు.

375 కేంద్రాలు..

జిల్లాలో వానాకాలంలో సీజన్లో రైతులు 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 750000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే దిగుబడి అంచనాలను బట్టి జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయి. మూడు రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల వాయిదా పడింది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు.

కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు..

ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ తాగు నీరు, మరుగు దొడ్లు, టెంట్, విద్యుత్ సౌకర్యం ఇతర ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ప్రతి కేంద్రంలోనూ సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం కోసం ప్రత్యేక కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయనున్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆధ్వర్యంలో ఇతర జిల్లాల నుండి ధాన్యం జిల్లాకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయనున్నారు. జిల్లాలో ముందుగా మండలానికి ఒక కేంద్రం ఆతర్వాత వరి కోతలను బట్టి కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశముంది.

1.5 కోట్ల గన్నీ బ్యాగులు..

జిల్లాలో 1.87 కోట్ల గన్ని బ్యాగుల అవసరం ఉండగా ప్రస్తుతం 1.5 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా కేంద్రానికి 30 చొప్పున 11250 టార్పరిండ్లు కావలసి ఉండగా ప్రస్తుతం 6వేల టార్పాలిన్లు ఉన్నాయి. అదేవిధంగా 2వేల వేయింగ్ స్కేలు, 350 ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో సీఎంఆర్ కు సంబంధించి సుమారు 135 రైస్ మిల్లులు ఉండగా..గత సీజన్ లో సీఎంఆర్ క్లియర్ చేసిన వారికి ధాన్యం కేటాయిస్తారా.. లేక అన్ని మిల్లులకు దిగుమతి చేస్తారా అనే విషయంలో స్పష్టత లేదు. జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించి 65 శాతమే సీఎంఆర్ పూర్తి కాగా వానాకాలానికి సంబంధించి 95 శాతం సీఎంఆర్ పూర్తయ్యింది. యాసంగి కాలానికి సంబంధించి సుమారు 30 నుండి 35 మంది రైస్ మిల్లర్లు సీఎంఆర్ ను అందించాల్సి ఉంది.

ఏఈఓలదే కీలక పాత్ర..

ధాన్యం తేమశాతం పరిశీలన, టోకెన్లు, సన్న రకం ధాన్యం నిర్ధారణలో ఏఈఓలు కీలక పాత్ర పోషించనున్నారు. రైతుల ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు, బ్యాంక్ ఖాతాలను పరిశీలించి టోకెన్లు ఇస్తే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్తారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనుండగా.. ఏఈఓలు జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు... డీఎస్ఓ వి. వెంకటేశ్వర్లు

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ల ఆధ్వర్యంలో పీపీసీ ఇన్‌చార్జిలకు గత గురువారమే శిక్షణ పూర్తయింది. తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. కేంద్రాలలో కావలసిన అన్ని ఏర్పాట్లను కూడా పూర్తిచేశాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా కొనుగోలు జరుగుతుంది.

హామీల అమలు కోసం ప్రజా ఉద్యమాలు చేపట్టాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దాని కోసం గ్రామ స్థాయిలో ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడలోని గణేష్ నగర్, ప్రకాష్ నగర్, రవీంద్ర నగర్, శాఖల మహా సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజల సంపదను కార్పొరేషకులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు మత రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల పట్ల ప్రజల ఆదరణ చూపుతున్నారని ఇటీవల శ్రీలంక ఎన్నికల్లో అది రుజువైందన్నారు. ప్రపంచ మానవాళికి కమ్యూనిస్టు సిద్ధాంతమే మార్గదర్శకమని చెప్పారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలని కోరారు. ప్రజా ఉద్యమాల ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధం కావాలన్నారు. అంతకుముందు గత మూడు సంవత్సరాలుగా చేసిన ప్రజా ఉద్యమాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గణేష్ నగర్ లింగయ్య, ప్రకాష్ నగర్ కార్యదర్శి గా నిరంజన్, రవీంద్ర నగర్ కార్యదర్శిగా కోటయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, భవాండ్ల పాండు, అయూబ్, రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు దేశిరం నాయక్,సాంబ నాయక్, ముడవత్ రాము, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నిందితుడి అరెస్టు, రిమాండ్

- నార్కట్‌పల్లి పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-ప్రాంతీయ ప్రతినిధి నల్లగొండ

నార్కట్‌పల్లి గ్రామ శివారులోగల స్పెక్ట్రా వెంచర్‌లో కాలేజీ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్న నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినఘటన ఆదివారం చోటుచేసుకుంది. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్సై క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెదుర్తి మండలం ద్రోనమరాజునగర్‌కు చెందిన సాగి దిలీప్‌వర్మ కొంతకాలంగా సునాయాసంగా డబ్బులు సంపాదించవచ్చని ఆలోచనతో నార్కట్‌పల్లి మెడికల్ కళాశాల చుట్టుపక్కల ఇతర కళాశాల విద్యార్థులకు గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ప్రకారం శనివారం ఉదయం 6 గంటలకు సాగి దిలీప్ కుమార్ అనుమానస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని విచారించారు. హైదరాబాద్ లో 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి అక్కడ కొంత గంజాయిని అమ్మి మిగిలిన 650 గ్రాముల గంజాయిని తీసుకొని నార్కట్ పల్లికి స్కూటీ పై వచ్చాడు. గంజాయిని నార్కట్ పల్లి గ్రామ శివారులో గల స్పెక్ట్రా వెంచర్ లో గంజాయి తాగే వారికి ,నార్కట్ పల్లి చుట్టు పక్కల ఉన్న కాలేజి స్టూడెంట్స్‌కు, అవసరం ఉన్న వ్యక్తులకు గంజాయిని చిన్న చిన్న పాకెట్లలో తయారు చేసి అమ్మాలని ప్రయత్నిస్తుండగా ఎస్సై క్రాంతి కుమార్ సిబ్బందితో కలిసి దిలీప్‌ను అదుపులో తీసుకున్నారు.. నిందితునడి నుండి వద్ద నుండి 8 గంజాయి ప్యాకెట్ల (650 గ్రాముల విలువ రూ.16,500) ఒక స్కూటీ. స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు,

నార్కట్‌పల్లి పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

ఇట్టి కేసును నల్గొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి పర్యవేక్షణలో నార్కట్ పల్లి సీఐ కే.నాగరాజు ఆధ్వర్యంలో



నార్కట్ పల్లి ఎస్సై డి. క్రాంతి కుమార్ గంజాయి రవాణాను నివారించినందుకుగాను, వారి సిబ్బంది రాము, గిరిబాబు, తిరుమల్, శివశంకర్, శ్రీనివాస్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అక్రమ గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, అమ్మినా, ఎవరైనా వినియోగించినా, వాడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని, గంజాయి, సరఫరా, అమ్మే వ్యక్తుల పైనే కాకుండా, సేవించే వినియోగించే వ్యక్తుల పైన కూడా చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా చేసేవారి గురించి సమాచారం తెలిసిన వెంటనే, డయల్ 100 డయల్ 8712670266 ద్వారా లేదా నేరుగా పోలీసు సిబ్బందికి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నివారణలో ప్రజలు, పోలీసు వారికి సహకరించి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అందరూ పాలుపంచుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

నవతెలంగాణ-దేవరకొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పల్లా పర్వత రెడ్డి భవన్ లో జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, దేశంలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలతో పేద మధ్యతరగతి ప్రజలు పండగలు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు సమూలంగా మార్చి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం హరించి వేసిందన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు ,పెన్షన్ల పెంపు రైతు భరోసా ఇలాంటి హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్. కనకాచారి అధ్యక్షత వహించిన సమావేశంలో బొడ్డుపల్లి వెంకటరమణ, యండి మైనుద్దీన్, తూమ్ బుచ్చిరెడ్డి, పోలే వెంకటయ్య, బొమ్మ అచ్చయ్య, ఉప్పునూతల వెంకటయ్య నూనె రామస్వామి, వలమల ఆంజనేయులు, కే. జయరాములు, పాండురంగారెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, జూలూరు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-చిట్యాల

సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నకిరేకల్ నియోజకవర్గ కమిటీ, చిట్యాల మండల కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కేంద్రంలో ఆదివారం సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు పరిటాల రవిగౌడ్ సమక్షంలో నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా కొంపెల్లి శ్రీనివాస్‌గౌడ్ , ప్రధాన కార్యదర్శిగా కాసుల సత్యనారాయణగౌడ్‌లను ఎనుకున్నారు. అదేవిధంగా చిట్యాల మండల కమిటీ అధ్యక్షులుగా పంతంగి వెంకన్న గౌడ్ ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శంకర్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో కనకదుర్గ దేవస్థానం చైర్మన్ మారవుడు ఆంజనేయులు గౌడ్ చిట్యాల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు మారగోని రమేష్ గౌడ్ రేగుల గడ్డ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నవతెలంగాణ-మర్రిగూడ



మండలంలోని దామెర భీమనపల్లి గ్రామానికి చెందిన ఐతరాజు పాపయ్య తన ఇంట్లో కిరాణా షాపును నడుపుతూ అందులోనే అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడనే పూర్తి సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. 12 లీటర్ల ఐ ఎం ఎఫ్ ఎల్ లిక్కర్ ను స్వాధీనం చేసుకొని కిరణా షాప్ సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే. రంగారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **మిర్యాలగూడ రూరల్ :** మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం సరస్వతీ దేవాలయంలో శ్రీ దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం సరస్వతి అమ్మవారు శ్రీ వైష్ణవి దేవి, శ్రీ లలిత త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు త్రిపురనేని శరత్‌బాబు మాట్లాడుతూ ఈనెల 9న మూల నక్షత్రం సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొప్పన రామకోటేశ్వర్‌రావు, సత్యనారాయణ, రామ్మూర్తి, రాజేంద్రప్రసాద్, జయశంకర్, ఆలయ పూజారి, సిబ్బంది పాల్గొన్నారు.
- దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మిర్యాలగూడ రైల్వే కాలనీ సాయి దత్త ఆశ్రమంలో ఆదివారం శ్రీ చండీ హెూమం నిర్వహించారు. తితిదే వేద పండితులు పీసపాటి లక్ష్మీ గణపతి శాస్త్రి ఆధ్వర్యంలో హెూమం నిర్వహించారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, మట్టయ్య, సోమన్న, జానకిరాముడు, జగన్నాధరావు, సత్యనారాయణ, చంద్రకళ, పద్మ, భాగ్యలక్ష్మి, శారద, కళ్యాణి, భవాని తదితరులు పాల్గొన్నారు.
- **చిట్యాల :** చిట్యాల పురపాలిక కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో జరుగుచున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం కనకదుర్గ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా 108 చీరలతో అమ్మవారి అలంకరించారు. ఈ కార్యక్రమంలోఆలయ చైర్మెన్ మారగోని ఆంజనేయులుగౌడ్, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, డైరెక్టర్లు బుద్ధ విమల కృష్ణమూర్తి, గంజి వెంకటేశం, రుద్రారపు లింగస్వామి, జిట్టా సాయిలు, వనమా నిఖిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతుల పట్ల అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా ఈనెల 7వ తేదీ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పొన్నం లక్ష్మయ్య, నాయకులు ఆగు అశోక్ లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరవుతారని తెలిపారు.
- **నకిరేకల్ :** శ్రీ స్వయంభు కాళికామాత దేవాలయంలో ఆదివారం కనకదుర్గాదేవి అమ్మవారికి భక్తులు పంచామృతం అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళికామాత దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మదేవర రవిశంకర్, డి కొండ ప్రకాష్, కొండేటి శ్రీనివాస్, బెక్కంటి నాగరాజు, బచ్చు శ్రీనివాస్ ధర్ శ్రీదేవి గారు, మానస, వడ్లకొండ లక్ష్మమ్మ, కుంభం అనిత శ్రీనివాస్, భీమన బోయిన రమేష్, నల్ల సతీష్, మాచర్ల శశి భవాని స్వామి, నారా ధార శంభవాని స్వామి, బోడ సంపత్, బంటు సైదులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన రవీందర్

కట్టంగూర్ మండల కేంద్రంలోని కంఠమహేశ్వర సురమాంబ దేవి మహెూత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

- మహాలక్ష్మి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 7న స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వంటల రామలింగం, కార్యదర్శి కందుల సోమయ్య తెలిపారు. ఈ శిబిరంలో రిటైర్డ్ ఉద్యోగులు, డ్యూటీలో ఉన్న ఉద్యోగులు, మెడికల్ కార్డు ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి మాత్రమే ఉచిత రవాణా, భోజన వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రచార కార్యదర్శి శివకోటి ఆంజనేయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైద నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆ సంఘ: మిర్యాలగూడ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న పేద విద్యార్థులు పై చదువులు చదువుకోవాలంటే అవకాశాలు లేకపోవడం బాధాకరమన్నారు .గత ప్రభుత్వంలో బకాయిలో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ 8 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం ఇప్పటికీ లక్షలాది రూపాయలు వడ్డీకి తీసుకొని వచ్చి పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు కానీ ప్రభుత్వాలు పేద విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. పేద వర్గాలకు చెందిన ఎస్టీ, ఎస్సీ బీసీ మైనార్టీ విద్యార్థులు చదువుతున్న హాస్టల్ లో పౌష్టికాహారం అందించకుండా అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మెస్ బకాయిలు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు జగన్ నాయక్, టౌన్ కార్యదర్శి న్యూమాన్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ప్రసన్న, దామచర్ల వేములపల్లి మిర్యాలగూడ మండల కార్యదర్శులు వీరన్న, సంపత్, మనీ, సిపాయి నాయక్,తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్ ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



సెల్ ఫోన్లు పోగొట్టుకున్నటువంటి బాధితులకు ఫోన్లో రికవరీ చేసి ఆరుగురు బాధితులకు ఫోన్లో అప్పగించినట్లు ఎస్సై రామ్మూర్తి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరు కుంట తండా గ్రామానికి చెందిన రామావత్ శ్రీను, నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌లో పనిచేస్తున్నటువంటి డాక్టర్ కిరణ్, గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన జోగు వెంకన్న, నాంపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన గార్లపాటి మధు, నాంపల్లి మండలం దేవత్ పల్లి గ్రామానికి చెందిన కొమ్ము రాములు, కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన సత్యనారాయణలు గతంలో తమ సెల్ ఫోన్లు పోగొట్టుకోవడంతో ఇట్టి విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి సిఈఐఆర్ యాప్‌లో నమోదు చేసి పోయిన ఫోన్లను వాడుతున్న వ్యక్తుల వద్ద నుంచి రికవరీ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఆరుగురి బాధితులకు ఫోన్లు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్ఐ రామ్మూర్తికి, ఐడి పార్టీ సిబ్బందికి హేము నాయక్, చిన్నలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-చిట్యాల



మండలంలోని చిన్న కాపర్తి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మెన్ ఏనుగు రఘుమారెడ్డి పాలకవర్గ సభ్యులు, రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కాపర్తి, పిట్టంపల్లి ,బోయగుబ్బ, మొగిలిదోరి, మొర్సుగూడెం గ్రామాల నుండి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గంగాపురం భాస్కర్, బోయపల్లి స్వామి, సీఈవో బొంతల రాజిరెడ్డి ,సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ-చింతలపాలెం



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై అంతిరెడ్డి ఆదివారం తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో టిజి 29 టి 2489 అను లారీ కోదాడ నుండి చింతలపాలెంకు ఇసుకను లారీలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేయగా ఇసుకకు సంబంధించిన వే బిల్లు లేకపోవడంతో లారీ యజమానిపై కేసు నమోదైందన్నారు.లారీ డ్రైవర్ పేరు బడావత్ ఉపేందర్ గ్రామం కూచిపూడి తండాకు చెందిన వాడన్నారు.

ఖుతుబ్ షాపురం కోనాయిగూడెం సీపీఐ(ఎం) గ్రామ శాఖలు ఎన్నిక

నవతెలంగాణ-గరిడేపల్లి





మండలపరిధిలో ఖుతుబ్‌షాపురం కోనాయిగూడెం గ్రామ శాఖ కార్యదర్శిగా ఆకుల అరవింద్, సైదిరెడ్డి కమిటీని ఎన్నుకున్నారు.సీపీఐ(ఎం) మహాసభలో ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్‌కె.యాకూబ్ మాట్లాడుతూ నూతన గ్రామ కార్యదర్శులుగా ఎన్నికైన మండల కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

హామీలను అమలు చేసామనడం హాస్యాస్పదం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు

నవతెలంగాణ-అర్వపల్లి



కాంగ్రెస్ ఎన్నికల ముందు చాంతాడంత హామీలిచ్చి నేడు బారెడు హామీలు అమలు చేసి ఎన్నో చేశామని చెప్పటం హాస్యాస్పదమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని పర్సాయిపల్లి గ్రామంలో ఆ పార్టీ మహాసభను అరిగే వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయిలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీని అమలు పరిచారని కానీ మిగతా హామీలు కొన్ని సంపూర్ణంగా అమలు కావడం లేదని విమర్శించారు. గ్యాస్ పై రూ.500 సబ్సిడీ ఇస్తున్నామన్న ప్రభుత్వ మాటలు చెబుతుంది కానీ పేదల అందరికీ అమలు కావడం లేదన్నారు. రైతుల రుణమాఫీ రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ 70శాతం పూర్తి కాలేదన్నారు. ఇంకా 30శాతం మంది ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. తెల్ల రేషన్ కార్డు నిబంధన లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ తెల్ల కార్డులు ఇస్తామని ప్రకటించిన సర్కార్ మాటలు చెబుతూ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని అందులో కూడా స్పష్టత కరువైందన్నారు. ఇప్పటికీ తెల్ల కార్డు ఉన్నవాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవాలా లేదా లేని వారు చేసుకోవాలా అనేది స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతుబంధు పథకం కింద రైతు భరోసాను పేరు మార్చి పంట సహాయం కోసం ఎకరానికి రూ.15వేల సహాయం చేస్తామన్న ప్రభుత్వం హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విస్మరిస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు ఏకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగా వెంకన్న, వజ్జె సైదులు, బొడ్డు సైదులు, నిమ్మనగోటి అబ్బులు, కొమ్ము విజయ్, సంపత్తి వెంకన్న, బిక్కినేటి వెంకటేశ్ అరిగే సురేష్, రాజు, నర్సయ్య, మరిపెల్లి మల్లయ్య, పాల్గొన్నారు.

రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు

నవతెలంగాణ-నేరేడుచర్ల



ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగంగా రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆ పార్టీ ఒకటవ శాఖ రెండవ శాఖ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే పూర్తిస్థాయిలో అమలు జరపాలన్నారు. ప్రజలకురేషన్ కార్డు లేక పదేండ్లు అవుతుందని వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలని ,ఇండ్లు ఇండ్ల స్థలాలు అర్హులైన వారందికి ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలవాలన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలపై రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. అంతకుముందు పతాకాన్ని ఎం.రుద్రమ్మ ఆవిష్కరించారు. కుంకు తిరుపతయ్య అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ ,ఒకటవ శాఖ కార్యదర్శి ఎస్‌కే. ఆఫీస్, రెండవ శాఖ కార్యదర్శి ఎడ్ల సైదులు, ఆనెగంటి మీనయ్య, నీలా రామ్మూర్తి, వాస సంపత్, బట్టు. శ్రీను, గుర్రం యేసు, పొనుగోటి శ్రీనివాసరావు, బుల్లి పెళ్లి శ్రీను, వడ్లకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్



ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని అప్పుడే గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొంటుందని మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాసర్వాద గ్రామంలో కనకదుర్గమ్మ మండపం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేనారెడ్డి, మండల అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి,నాయకులు పోలగని సైదులు,పూజల రవి,డాక్టర్ వెంకటేశ్వర్లు, అన్నదాన నిర్వాహకులు సిరా యాదయ్య, భూపాల్. రాములు. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రా పేరిట డైవర్ట్ పాలిటిక్స్'

నవతెలంగాణ-పాలకీడు



రాష్ట్రంలో హైడ్రా పేరిట డైవర్ట్ పాలిటిక్స్ నడుస్తున్నాయని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాశ్ విమర్శించారు. మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో ఆదివారం పార్టీ గ్రామ శాఖ మహాసభ, గుడ్డేటి నందయ్య అధ్యక్షతన నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఆ పార్టీ జెండాను మాజీ ఎంపీటీసీ దొంగల వెంకటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హైడ్రా పేరిట డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఎక్కడ పూర్తిస్థాయిలో అమలు పరచడం లేదన్నారు. ప్రజలను దృష్టి మళ్లించడానికి అధికారపక్షం, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లు వ్యక్తిగత విమర్శలతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు ప్రత్యామ్నాయ నివాసం, నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే పేదల ఇండ్లను కూల్చాలని డిమాండ్ చేశారు.అనంతరం సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శిగా తరికొండ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో మాజీ ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, తోరికొండ వెంకటేశ్వర్లు, దిద్దగుంట పురుషోత్తంరెడ్డి, సామల నాగిరెడ్డి, కృష్ణారెడ్డి,సైదిరెడ్డి, కందుల సుధాకర్ రెడ్డి, నందయ్య, బొగ్గరం సైదులు బొడ్డుపల్లి వెంకటయ్య, దిద్దకుంట్ల అమరారెడ్డి,రాయి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు చదును చేస్తూ ఆక్రమణ

నవతెలంగాణ-కోదాడరూరల్



మండలపరిధిలోని కాపుగల్లు గ్రామ శివారులో ఉన్న గుట్టలను చదును చేస్తూ కొంతమంది ఆ స్థలాలను ఆక్రమణకు గురి చేస్తున్నారు. ఇదేవిధంగా జరిగితే గ్రామ శివారులో ఉన్న గుట్టలు మొత్తం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన అనేకమంది పశువులను గొర్రెలను ఈ గుట్టలపై ఉన్న పచ్చి గడ్డిని చెట్టు చేమను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది తమ స్వార్థం కోసం గుట్టలను చదును చేసి ఆక్రమించారు. పశువులకు మేత దొరకకుండా పోతుంది అని పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణానికి ఈ గుట్టల ద్వారా మట్టిని సేకరించడం వలన గుట్టలు చాలా వరకు కనుమరుగు అయినాయి. మండల పరిధిలోని ద్వారకుంట ఆమ్లెట్ గ్రామం నెమలిపురి కాలనీ నుండి కాపుగల్లు వెళుతుంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉండేదని గ్రామస్తులు తెలుపుతున్నారు.ఈ మట్టి తవ్వకాల వలన రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది అని గుట్టలు మొత్తం ధ్వంసం చేసి తమ స్వార్థానికి వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీల సహాయంతో గుట్టలను చదును చేస్తూ ఆ స్థలాలను కబ్జా చేస్తున్నారు.అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో వున్న గుట్టలను ఆక్రమణల నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-గరిడేపల్లి



మండలకేంద్రంలో 1988- 89 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులుఒకే చోట కలవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితోపాటు చిన్న నాడు కలిసి చదువుకున్న విద్యార్థులకు ఎటువంటి ఆపద వచ్చిన అందరూ అండగా ఉంటామన్నారు.అనంతరం స్కూల్‌లో చిన్ననాడు ఆడిన ఆటలు ఆడి, పాడి ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం నాడు విద్యా బుద్ధులునేర్పిన గురువులను, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు పి.రామ్మూర్తి, పి.చంద్రారెడ్డి, ఎన్.వెంకట్రెడ్డి, ఎస్.శ్రీనివాస్, ఆర్.వెంకటలక్ష్మి అమృతారెడ్డి, పూర్వ విద్యార్థులు ఆర్.జగ్గారెడ్డి ఎస్. విజయ మారుతి, సిహెచ్. వీరయ్య, ఎండి .జయరుద్దీన్ పి. ముత్యాలు, సిహెచ్.మట్టయ్య, జి .శ్రీనివాస్, ఏ బాల్ రెడ్డి ,పి.రమాదేవి, చంద్రకళ, ఎం.మణెమ్మ, టీ. కవిత, పి.పద్మ, ఎస్.సావిత్రి, కే.శ్రీనివాస్, ఎం.మట్టారెడ్డి,పి.సైదులు, కే.సైదిరెడ్డి, ఎండి. యాస్గర్, ఆర్వి. రామన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితంలో సమాజసేవకు ప్రాధాన్యత

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



విశ్రాంత జీవితంలో కుటుంబంతో పాటు సమాజసేవకు ప్రాధాన్యత ఇస్తానని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అడిషనల్ సెక్రెటరీగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఉప్పు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆయన స్వగ్రామం రామారంలో కుటుంబ సభ్యులు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. విధినిర్వహణలో భాగంగా ఎంతో మందికి ఉపయోగ పడినట్లు చెప్పారు. త్వరలో గ్రామంలోని యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పై అవగాహన కల్పించి గ్రూపుల వారీగా ప్రభుత్వ అందించే ఉచిత నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామన్నారు. ముందుగా వారి మాతృమూర్తి, స్వాతంత్ర్య సమరయోధురాలు ఉప్పు రంగమ్మ ను కుటుంబసభ్యులు సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప్పు రాములు, ఉపేందర్ రావ్, రాకేష్, పాలవరపు కృష్ణమూర్తి, బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పెన్‌పహాడ్

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులుగా పెన్‌పహాడ్ మండల ఉపాధ్యాయులు ఎన్నికైనట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు సంధ్యాల వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా సూర్యాపేట జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా అల్లాడి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులుగా సంద సైదిరెడ్డి, వీరబోయిన నాగయ్య, వేమూరి జానకిరాం, యడవెల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులుగా బొజ్జ శోభన్ బాబు, పిన్నని నవీన్ కుమార్ లు, జిల్లా మహిళా కార్యదర్శిగా మేడారపు శైలజలు ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన వారికందరికీ మండల శాఖ పక్షాన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పెన్ పహాడ్ మండలం మీద ఉన్న ప్రత్యేక అభిమానంతో జిల్లా అసోసియేట్ పదవి మరియు ఇతర పదవులు ఇచ్చి సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తంగేళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్‌లకు మండల అధ్యక్ష కార్యదర్శులు సంధ్యాల వినోద్, నల్ల శ్రీనివాస్ లు ధన్యవాదములు తెలిపారు.



ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోనీ అశోక్ నగర్‌లో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం సతీ సమేతంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, బత్తుల మాధవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, నిర్వాహకులు కర్నాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాలి

నవతెలంగాణ-అర్వపల్లి

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెరిగిపోతున్నాయని , వెంటనే వాటిని నిర్మూలించాలని ఫూలే అంబేద్కర్ కమిటీ ఆశయ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఈదురు వీర పాపయ్య కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత మందు, గంజాయి, గుట్కాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. బెల్ట్ షాపులను గ్రామాల్లో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్కల సురేందర్, హైకోర్టు అడ్వకేట్ సిరుపంగి నరసింహ ,హైకోర్టు అడ్వకేట్ దాసరి బిక్షం, శతకోటి వెంకన్న ,సరస్వతీ పద్మ ,ఎర్ర అనుదీప్, పాముల కృష్ణ, కందుకూరి రవికుమార్ పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపు ఏర్పాటు

నవతెలంగాణ-చింతలపాలెం

మండల కేంద్రంలోని ముత్యాలమ్మ బజార్లో వాంతులు వీరేచనాలతో బాధపడుతూ రోజు రోజుకీ రోగుల సంఖ్య పెరుగుతుండడంతో సత్వరమే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ వాసులు కోరడంతో వైద్య అధికారులు స్పందించి మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రౌండ్ వాటర్ పొల్యూషనా లేక ఇంకా ఏదైనా కారణమా తెలియక ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఏఎన్‌యం కళ్యాణి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-భువనగిరి

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని ప్రణాళికలు రూపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల చైర్మెన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ గడ్డం సోమచంద్‌లు కోరారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ గార్డెన్‌లో శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల 2024 ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలతో తమ కెరియర్ని నిర్మించుకోవాలన్నారు. శ్రీ వైష్ణవి కళాశాలలో విద్యతో పాటు సాంస్కృతిక క్రీడా రంగాలలో రాణించే విధంగా కృషి చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మధిర మల్లేశం మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ ద్వితీయతో పాటు జేఈఈ, నీట్, ఎంసెట్ లాంటి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఆర్టీఐ రక్షక్ జిల్లా అధ్యక్షునిగా కూనూరు మధు

నవతెలంగాణ-చిట్యాల



ఆర్టీఐ రక్షక్ జిల్లా ప్రెసిడెంట్‌గా చిట్యాల మండల కేంద్రానికి చెందిన కూనురు మధును నియమిస్తూ ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 పౌరులకు ఒక ఆయుధంగా ఉంటుందని, సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి అక్రమాలను బయటపెడతామని అన్నారు. ఆర్టీఐ రక్షక్ సంస్థలో జిల్లా, మండల కమిటీల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళ్లెం చంద్రశేఖర్, ఉపేందర్ ఆర్టీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేట్ బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు
- ఒకరికి విరిగిపడిన చేయి
- డ్రైవర్ పై కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగం.. అజాగ్రత్తగా బస్సు నడపడం వల్ల బస్సు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 13 మందికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై సైదా బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మర్రి గూడ బైపాస్ హైదరాబాద్ రోడ్డు చంద్రగిరి విల్లాస్ కాలనీకి వెళ్లే దారి వద్ద చెన్నైకి వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన (పి వై 01-సీఎస్-3407) నెంబర్ గల ప్రయివేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో 13 మంది గాయపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో బస్సులో సుమారు 35 నుండి 40 మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో ఒకరికి కుడి చేయి విరిగిపోయింది. మిగిలిన వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. నల్లగొండ లోని మర్రిగూడ బైపాస్ వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో రోడ్డుపై అడ్డంగా పెట్టిన బారికేడ్లను తప్పించబోయి బస్సు ఫల్టీ కొట్టింది.ఏపీ లోని కర్నూలు జిల్లా నంద్యాల కు చెందిన బాచిరెడ్డి అమర్నాథ్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ జిల్లా కు చెందిన బస్సు డ్రైవర్ పుండ్ర మనోహర్ పై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

యాదగిరిగుట్ట పట్టణం ఆదివారం బీర్ల నివాసంలో ప్రభుత్వ విప్ ఐలయ్య చేతుల మీదగా చిన్నం అంజయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోక్కలకొండ అరుణ, గ్రామ శాఖ అధ్యక్షులు చిన్నం శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ గడ్డమీది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఆందోల్ మైసమ్మ దేవాల యంలో ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్.మోహన్ బాబు, అర్చకులు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని పూర్ణకుంభంతో ప్రత్యేకంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.



వైటీడీఏలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్



వైటీడీఏలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీం డిమాండ్ చేశారు.ఆదివారం యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు,సీపీఐ(ఎం) యాదగిరిగుట్ట ఎనిమిదవ మండల మహాసభ భీమగాని రాములు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు జమ్ము భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం వైటీడీఏ అభివృద్ధి పేరుతో అనేక అవకతవకలకు పాల్పడినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అందుకే గత ప్రభుత్వం అవినీతిని వెలికితీయాలని కోరారు. యాదాద్రి దేవాలయం పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే పనులు పూర్తిచేసి భక్తుల అసౌకర్యాలు తొలగించాలని కోరారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రజావ్యతిరేక విధానాలు తీసుకొస్తుందని విమర్శించారు.జమిలీ ఎన్నికలు తీసుకొస్తే రాష్ట్రాల హక్కులు కోల్పోతాయన్నారు. విశాల భారత దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదన్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు అవలంబిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నిక ల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.యాదగిరిగుట్ట మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాటాలు నిర్వహించినప్పుడే పార్టీ విస్తరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరు బాలరాజుగౌడ్, మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, నాయకులు వంటేరు పెంటారెడ్డి, కాలే స్వామి, సుబ్బూరు సత్యనారాయణ, ఇంజలింగం, జోగు శ్రీనివాస్, భీమగాని మాధవి, నేలపట్ల శంకర్, పత్తి నరసింహులు, జమ్మూ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

యాదగిరిగుట్ట పట్టణం ఆదివారం బీర్ల నివాసం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదగా ఆరే బాలమణికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాజీపేట కాంగ్రెస్‌గ్రామ శాఖ అధ్యక్షులు కుండే సిద్దులు, డీసీసీబీ డైరెక్టర్ రామచందర్, యూత్ అధ్యక్షులు కృష్ణస్వామి, గంధమల్ల గంగయ్య, నమిల శ్రీశైలం, తలుపునూరి సురేష్, కోలయాదగిరి గౌడ్, మొగిలిపాక నర్సింహులు, ఆరే నవీన్ గౌడ్, ఒగ్గు సురేష్, గంధమల్ల స్వామి, ఆరె. రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

ఆలేరు నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని, మెస్ బిల్లులను పెంచాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్టీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిప్యూటి సీఎం బట్టి విక్రమార్కకు ఆదివారం వినతిపత్రం అందజేశారుప్రభుత్వ హాస్టల్స్‌లో మెస్‌బిల్లులను పెంచాలని కోరుతూ అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీ పేద విద్యార్థులు ఉన్న నేపథ్యంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆలేరు నియోజకవర్గానికి కూడా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.



స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

స్నేహితురాలి కుటుంబానికి అండగా 1991బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు.యాదగిరిగుట్ట 1990-1991 పదవ తరగతి బ్యాచ్ తమతో పాటు చదువుకున్న స్నేహితురాలు అరుణ భర్త దశరథ అనారోగ్యంతో మరణించాడు.ఈ సందర్భంగా పదవతరగతి స్నేహితులు ఆ కుటుంబాన్ని కలిసి సంతాపాన్ని తెలియజేసి రూ. 67000 ఆర్థికసాయం అందజేసి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాళ్ల లక్ష్మారెడ్డి, గడ్డమీది మాధవులు,దీకొండ వెంకటేష్, కీసరి కిషన్, గుండ్లపల్లి నరసింహ, కర్రె మల్లేష్, శిఖ బాలరాజు, సత్యనారాయణ (టీచర్) ఎక్కలదేవి భాస్కర్, బిలిదే ప్రవీణ్, మూడ నర్సింహ, బబ్బూరి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మోత్కూర్ : మోత్కూరు పట్టణకేంద్రంలో ఈనెల 8న జరగబోయే సీపీఎం పట్టణ రెండవ మహాసభను జయప్రదం చేయాలని, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుబొల్లు యాదగిరి కోరారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భవిష్యత్ కర్తవ్యాలు తీసుకొని ప్రజా సమస్యలపై కార్యక్రమాలు రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ మహాసభకు ఆ పార్టీ, జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్,కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, హాజరైతునట్లు తెలిపారు.

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు కనిపించారు.ఆర్యవైశ్య సంఘం భక్తులు అమ్మవారి మండపాన్ని 45 లక్షల రూపాయలతో మండపాన్ని కరెన్సీతో రూపాయల నోట్లతో అలంకరించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కాంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజపేట : రాజాపేట మండలం జాల గ్రామానికి చెందిన మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపెల్లి రామ్‌రెడ్డి తండ్రి గొల్లపల్లి కృష్ణారెడ్డి దశదినకర్మ ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు.కృష్ణారెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు ప్రతినిధులు కుటుంబ సభ్యులు బంధువులు జర్నలిస్టులు ఎంఈఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పింజా మహేష్, మండల నాయకులు, పి.సమ్మయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ ఆలేరు నియోజకవర్గ నాయకులు కోయ బాలరాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

25 లక్షల మందికి వెలుగులు నింపేందుకే మూసీ ప్రక్షాళన

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



రైతులు, వివిధ వర్గాల ప్రజలు, 25 లక్షల మందికి వెలుగులు నింపే మూసీ ప్రక్షాళన, ముఖ్యమంత్రి నేతృత్వంలో చేపడుతున్నామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. హైదరాబాద్ నాగోల్‌లోని శుభం గార్డెన్స్ ఏర్పాటు చేసిన మూసీ ప్రక్షాళన చేద్దాం, బాధిత రైతు సదస్సు కార్యక్రమంలో, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారా బాద్, అనంతగిరి కొండల్లో పుట్టి హైదరాబాద్ నగరం మధ్య నుండి వెళ్తున్న మూసీ కృష్ణానది ఉపనది అని చెప్పారు. హైద రాబాద్, నల్గొండ, రంగారెడ్డి ప్రజల దాహార్తి తీర్చిన మూసి,1980వ దశకం నుండి హైదరాబాద్లో పారిశ్రామిక అభివృద్ధితో మురికి కూపంల మారిందని పేర్కొన్నారు. బృహత్తర మూసి ప్రక్షాళన చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలన్నారు. మూసీలో అక్రమ కట్టడాలను కూల్చాలనేదే బీఆర్ఎస్ గుర్తు చేశారు. మంచిపనికి మీరందరూ అడ్డు తగలడం అంటే, పేదల జీవితాలపై మీకున్న చిత్తశుద్ధికి నిదర్శనం అని దుయ్యబట్టారు. ఇంకా మూసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే పేదల ఉసురు తగిలి పోతారని శాపనార్థాలు పెట్టారు.

స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ పదవ మహాసభ ఉడుత విష్ణు అధ్యక్షతన నిర్వహించగా, ఆ మహాసభకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ మాట్లాడారు. బస్వాపురం గ్రామంలో ఉన్న సమస్యలపై నాలుగేండ్ల నుండి ఉసిర్ల ఆగుపై బీటి రోడ్ వేయాలని హనుమాపురం నుండి బస్వాపురం వరకు బీటీ రోడ్డు వేయాలని బస్వాపురం నుంచి గంగసానిపల్లి వరకు బీటీ రోడ్ వేయాలని గ్రామంలో సీసీరోడ్లు, డ్రయినేజీ సమస్యలు ఉన్నాయని తెలిపారు.గతంలో పేదలకు పట్టాలిచ్చిన స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అనేకసార్లు అధికారుల దృష్టికి మాజీ ఎమ్మెల్యే దృష్టికి ఇప్పుడున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి అనేక సార్లు తీసుకుపోయినప్పటికీ ఏ సమస్యా పరిష్కారానికి నోచలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఆ పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, సీనియర్ నాయకులు ఉడత విష్ణు, ఉడుత సత్యనారాయణ, ముదిగొండ కృష్ణ, మధ్యపురం బాలనరసింహ, నరాల చంద్రయ్య, ఉడుత వెంకటేష్, పార్టీ సభ్యులు ఉడుత సిద్ధులు, మచ్చ జహంగీర్, మచ్చ భాస్కర్, రాసాల దేవేందర్, రాసాల ఐలయ్య, నరాల బాలకృష్ణ ఉడుత దశరథ లు పాల్గొన్నారు.

మహిళలు సంఘటితంగా ఉద్యమించాలి

నవతెలంగాణ-నకిరేకల్

మహిళలు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్ చెన్నబోయిన నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని నర్ర రాఘవరెడ్డి స్మారక భవనంలో బహురోజు ఇందిరా ఆధ్వర్యంలో ఐద్వా మండల, పట్టణ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై లైంగికదాడులు,హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని నిర్మూలించాల్సిన ప్రభుత్వాలు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసరాలను అందించాలని, నిత్యవసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు అనంతరం 15 మందితో మండల, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు.మండల అధ్యక్షురాలుగా చెన్నబోయిన నాగమణి, కార్యదర్శిగా బహురోజు ఇందిర, పట్టణ అధ్యక్షులుగా పన్నాల శశికళ, కార్యదర్శిగా రాంపల్లి ఇందిర ను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు వి.రేణుక, గౌతమి, సోమమ్మ విజయ పాల్గొన్నారు.

పేపర్ ప్లేట్ తయారీ కంపెనీ ప్రారంభం

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండల పరిధిలోని చౌల్లరామారం గ్రామంలో పేపర్ ప్లేట్ కంపెనీని బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ చిన్న తరహా పరిశ్రమ అందుబాటులో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మన గౌటి జోజీ , బీజేవైఎం మండల అధ్యక్షులు గోలి సుమన్, బీజేపీ వెల్దేవిగ్రామశాఖ అధ్యక్షులు రాచకొండ శ్రావణ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు సైదులు పాల్గొన్నారు.

రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే ఊరుకోం

నవతెలంగాణ-రామన్నపేట



కాలుష్యాన్ని వెతదల్లి ఆదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పక్కన ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని, వ్యతిరేకించి తీరుతామని తెలంగాణ ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షులు కొండేటి మురళి, తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర మైనార్టీ ఎస్.కె.చాంద్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయ తలపెట్టిన సిమెంట్ ఫ్యాక్టరీ స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర రైల్వే స్టేషన్ కు ఆనుకొని 360 ఎకరాల భూమిని రైతుల నుండి డ్రైపోర్ట్ పెట్టనున్నామని చెప్పి కొనుగోలు చేశారని, తీరా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు తీసుకుంటున్నారని తెలిసి రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాననడం సరికాదన్నారు. వీలుంటే డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్కు గోదాములు ఏర్పాటు చేయాలని, స్థానికులకు ఉద్యోగం అవకాశం కల్పించాలని వారి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో దాసరి బుచ్చిరెడ్డి, నోముల శేఖర్, ఒంటెద్దు రమేష్, ఒంటెద్దు మారయ్య, బట్టే చెన్నయ్య, చిందాల వెంకటేశం, నోముల శ్రీను, శ్యామల బుచ్చయ్య, శ్యామల మారయ్య, శ్యామల లింగస్వామి, శ్యామల మారయ్య, ఒంటెద్దు బాలకృష్ణ, ఒంటెద్దు మారయ్య యం భిక్కయ్యి, గొరిగి రామకృష్ణ, గొరిగే శంకరయ్య మల్గ నరసింహ, చందాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీపీటీ కస్తూరి 2295 కొత్త రకం వరి సాగు



నవతెలంగాణ-అడ్డగూడూర్

మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన తుమ్మల వెంకటరెడ్డి బీపీటీ కస్తూరి2295 కొత్తరకం వరి సాగు మండలంలోని మొదటిసారిగా ఐదెకరాల విస్తీర్ణంలో సాగు చేయడం జరిగిందని ఆదివారం పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిచ్చే సన్న రకం నూతన వరి వంగడం అన్నారు.ఈ వరి పంట 5 నెలల 15 రోజులకు కోతకు వస్తుందని ఎకరానికి 70 బస్తాలు దిగుబడి ఆశించవచ్చన్నారు.పశుగ్రాసానికి చాలా ఉపయోగపడుతుందన్నారు.ఈ బీపీటీ కస్తూరి 2295 రకానికి చెందిన సన్నవరి మంచి ఆరోగ్యకరమైన వరి వంగడం అని తెలిపారు. మండలంలో రైతులు ఇలాంటి పంటలు పండించినట్టయితే తక్కువ పెట్టుబడితో మంచి లాభసాటి దిగుబడినిచ్చే ఇలాంటి కొత్త రకం వరి సాగు చేస్తే రైతులకు నష్టం వాటిల్లదన్నారు.

హైడ్రా పేరుతో పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

నవతెలంగాణ-బొమ్మలరామారం



హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని, పేదల ఇండ్లు కూల్చి వారి జీవితాన్ని నడిరోడ్డు మీదికి తెచ్చి వాళ్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి పేదలకు ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో హైదరాబాదులో చెరువుల పక్కన, కాలువల పక్కన ఇండ్లు నిర్మాణం చేసుకున్న పేదల ఇండ్లను కూల్చి వేయడం జరుగుతున్నదని, వారికి ప్రత్యామ్నాయంగా వెంటనే ఇండ్ల స్థలాన్ని చూపించి నిర్మాణం చేపట్టాలని కోరారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా సంవత్సరానికి నాలుగు లక్షల ఇండ్ల నిర్మాణం చేపడతానని చెప్పిన సీఎం నేటికీ ఉన్న ఇండ్లను కూల్చడమే తప్ప కొత్త ఇండ్ల నిర్మాణం చేపట్టడం లేదని విమర్శించారు.ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకుండా తప్పుల మీద తప్పులు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ కార్డు లేని పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంసారం యాదగిరి, మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు లింగయ్య ఎల్లయ్య, పున్నమ్మ, చిత్తమ్మ, బాలనర్సింహ, పోచమ్మ హేమలత, రాజు, తదితరులు, పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆలేరు నియోజకవర్గంలో లబ్దిదారులకు అందుతున్న పథకాలు, అభివృద్ధి పనులు, నియోజకవర్గానికి నలుమూలల వస్తున్న గోదావరి జలాలు వంటి అంశాలపై చర్చించారు.

ఎమ్మెల్యేను కలిసిన మాందాపురం గ్రామస్తులు

నవతెలంగాణ-వలిగొండరూరల్



మండలంలోని మాందాపురంకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం శాసనసభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.ఆయన వెంటనే స్పందించి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోలిపురం సాగర్‌రెడ్డి, దంతూరి ఆంజనేయులు, సోలిపురం వెంకట్‌రెడ్డి, కుసంగి స్వామి, పలుసం నవీన్, పల్సం బుచ్చిరాజు, పలుసం శివ, కుసంగి విజయ్, దేశపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సాయిగూడెం గ్రామ శాఖ ఎన్నిక

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం సాయిగూడేం బీఆర్ఎస్ గ్రామ శాఖను ఆదివారం ఆ పార్టీ మండలఅధ్యక్షులు గంగుల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు పుట్ట మల్లేశం సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు.అధ్యక్షులుగా జి.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులు ఇ.రాజు, ఎం.శ్రీను, సెక్రెటరీ జనరల్‌గా ఎండి అంజాద్, కార్యదర్శి.కోశాధికారిగా రవి, ప్రధాన కార్యదర్శిగా కర్నాకర్, గౌరవ సభ్యులుగా యు. రాములు,ఎ. నర్సింహులు ఎన్నికయ్యారు.కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు బీజని బాలరాజు, పాల సంఘం అధ్యక్షులు ఊదరి రాములు, పుట్ట పవన్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) తూర్పుగూడెం శాఖ కార్యదర్శిగా అంజయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండలం తూర్పుగూడెం సీపీఐ(ఎం) గ్రామం శాఖ కార్యదర్శిగా అందె అంజయ్య, సహాయ కార్యదర్శిగా గొడిశాల యాదగిరి ఎన్నికయ్యారు.మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ శాఖ మహాసభకు మహాసభను ఉద్దేశించి మాట్లాడారు.ఈ మహాసభలో సభ్యులు దూపటి జయ రాములు, పడిగం బాలనర్సమ్మ, తండ యాదమ్మ రంజిత్, అమర్‌నాథ్, జయమ్మ పాల్గొన్నారు.

యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

నవతెలంగాణ-రామన్నపేట

యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని మదర్ డెయిరీ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం నిధాన్‌పల్లి గ్రామంలో హరిహరపుత్ర కిరాణం, జనరల్ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిరాణా షాప్ నిర్వాహకులు బొడ్డుపల్లి రాజు, కొండ శేఖర్, తోటకూరి ఐలయ్య, కొండ మల్లయ్య, బీమనబోయిన చంద్రయ్య, బోడిగె రంగయ్య, వర్కాల గోపాల్,వెలకుర్తి బ్రహ్మచారి, బొడ్డుపల్లి తిరుపతి, కడారి ఐలయ్య బోనగిరి రమేష్, వర్కాల శ్రీను, ఆగు లింగస్వామి, లోడంగి రవి, ఆగు లింగస్వామి, చల్ల మల్లేశం, వర్కాల వినయ్, చల్ల నర్సింహా, కడారి యాదయ్య, గంగపురం మల్లికార్జున్, తోటకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంజయ్య

నవతెలంగాణ-వలిగొండరూరల్



మండలంలోని గొల్లేపల్లికి చెందిన జోగు అంజయ్యను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్‌నియమించి ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ కారుల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తన నియమాకానికి సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌను



పీఆర్టీయూ జిల్లాప్రధాన కార్యదర్శి గా, ఇటీవల ఎన్నికైన ఆలేరు పట్టణానికి చెందిన, గడసంతుల మధుసూదన్‌ను మల్లెల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు.అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్గిడి శ్రీశైలం, పత్తి వెంకటేష్, మొరిగాడి మల్లేష్ , చిమ్మి శివమల్లు, ఎమ్మె భాస్కర్, దయ్యాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండాకు చెందిన ధరావత్ నర్సింహ హార్ట్ ఎటాక్‌తో చనిపోగా అతని కుటుంబానికి గ్రామ యువకులు పెద్దలందరూ కలిసి రూ.43 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్‌నాయక్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌నాయక్, మధు నాయక్, ధరావత్ వెంకటేష్, కూనుసోతురెడ్డి, జి.కొండల్‌రెడ్డి, రవి, వి.శ్రీను, డి.జగన్, వి.వెంకటేశ్, డి.రాములు, బి.రఘు, దేవ్‌సింగ్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

దండు కదిలిందో.. గుండెల్లో దడే

నవతెలంగాణ-బొమ్మలరామరం



మండలంలోని మర్యాల గ్రామంలో కుక్కలబెడద తీవ్రమైంది. ప్రధాన రహదారుల వెంట ద్విచక్ర వాహనాల చోదకుల వెంట పడుతూ భయ బ్రాంతులకు గురి చేస్తు న్నాయి. వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగు తున్నాయి. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని గ్రామా ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com
4

గొర్రెలు బహిరంగ వేలం

- **జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.కృష్ణ**

భువనగిరి కలెక్టరేట్: చౌటుప్పల్ మండలంలోని పెద్ద కొండూరు పశు వైద్యశాలలో 113 గొర్రెలను బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం కింద సరఫరా చేసిన గొర్రెలను అక్రమంగా కొనుగోలు చేసి తరలించుకుపోతున్నపుడు నల్లగొండ పోలీస్‌స్టేషన్ నందు పట్టుకొని అప్పగించిన (113) గొర్రెలను (100 ఆడ , 13 పొట్టేలు) అక్టోబర్ 8వ తేదీన అనగా మంగళవారం రోజున ఉదయం 10.గంటలకు, ప్రభుత్వ పశు వైద్య శాల, పెద్దకొండూర్ (చౌటుప్పల్ మండలం) ప్రాంగణం నందు బహిరంగ వేలం వేయటం జరుగుతుందని పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన రైతులు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వీర్యానికి కుట్ర

ఆలేరుటౌన్ : పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాటనికి, ఎస్సీ,ఎస్టీ, బీసీలను బానిసలుగా మార్చడానికి డాక్టర్ బీఆర్ ంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని నెరవేరియం చేయడానికి కుట్ర జరుగుతుందని ప్రముఖ జర్నలిస్ట్, ఆధ్యాత్మికవేత్త గౌరీ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గల పేదలకు విద్యను దూరం చేయడానికి,జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని భూములను కేటాయించడం జరిగిందని, ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని, దళిత, గిరిజన, బిసి, మైనార్టీ సంఘాలు డిమాండ్ చేస్తూన్నయని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పాంగణంలోని పది ఎకరాల స్థలాన్ని వేరే యూనివర్శిటీ వారికి కేటాయించడం కోసం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించడం అన్యాయమన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- **సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు**



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

స్థానిక సమస్యల పరిష్కారంతోపాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం)కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు.ఆదివారం మండలంలోని పుట్టపాక గ్రామంలో నిర్వహించిన గ్రామ శాఖ 17వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతూ పేదల దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నార న్నారు. మతం పేరిట దాడులు పెరుగుతున్నాయన్నారు. ఇండియా బ్లాక్ పేరిట ప్రతిపక్షాలు గత ఎన్నికల్లో కొంతమేరకు బీజేపీ ప్రభావాన్ని తగ్గించారన్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాదం తగ్గించే దిశగా సిపిఐ(ఎం) నాయకులు గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ హైడ్రా పేర ప్రజల దృష్టి మళ్లిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుండి తప్పించుకోవాలని చూస్తుందన్నారు.రైతు రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేయకుండా సర్వేలు, ప్రజాభిప్రాయం పేరిట కాలయాపన చేస్తుందన్నారు.రైతు భరోసా నిధులను మంజూరు చేయలేదన్నారు.రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులుగా ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఇటీవల కాలంలో మృతి చెందిన పార్టీ ఆలిండియా కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి గారికి ఘన నివాళులు అర్పించారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం,పార్టీ సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు,మండల కమిటీ సభ్యులు ఐతరాజు గాలయ్య, శివశెట్టి లాలయ్య,చింతకాయల నరసింహ, రావిరాల మల్లేష్,మాజీ ఎంపీటీసీ మర్రి వసంత నర్సిరెడ్డి,నాయకులు పిట్ట రాములు, వర్కాల చంద్రశేఖర్, కొత్త శ్రీకాంత్, దొంతగాని అమరేందర్,నడుకుడి నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో టౌన్ నూతన కార్యదర్శి గా తిరిగి పిట్ట రాములు,సహాయ కార్యదర్శిగా కొత్త శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అదే విధంగా పార్టీ అమరవీరుల భవన శాఖ కార్యదర్శి గా పంక్కర్ల యాదయ్య, గుండ్లమిట్ట ఏరియా కార్యదర్శి గా దొంతగాని శంకరయ్య, హరిజన వాడ శాఖ కార్యదర్శిగా సుక్క స్వామి, చేనేత కార్మికుల శాఖ కార్యదర్శిగా రావిరాల మల్లేష్, మహిళా శాఖ కార్యదర్శిగా కేసిరేడ్డి జయమ్మ గార్లు ఎన్నుకున్నారు.

గుజ్జలో:

వెంటనే ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలనీ సీపీఐ(ఎం)యాదాద్రి భువనగిరి,నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి,బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండవీటి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన 17వ మహాసభలో వారు మాట్లాడారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.రైతు రుణమాఫీ,రైతు భరోసా,రూ. 500 గ్యాస్, కల్యాణ లక్ష్మి,గృహలక్ష్మి,ఆసరా పెన్షన్లు వంటివి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు.గ్రామానికి 35 ఏళ్లగా నడుస్తున్న ఆర్టీసీ బస్సును రద్దు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.గుజ్జ నుండి ఏపూరు వరకు బీటీ రోడ్డు నిర్మించాలన్నారు.గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలన్నారు.మహాసభ గ్రామ శాఖ నూతన కార్యదర్శులుగా చాడ నరసింహ,మహిళ కార్యదర్శిగా వెలిజాల గోపిక లను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.ఈ మహాసభలో మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి జెండావిష్కరణ చేశారు. నాయకులు బొమ్మ గాని శంకరయ్య,సత్తిరెడ్డి, మాణిక్యాల ఎలమంద,దాడి మైపాల్ రెడ్డి, వెలిజాల సుందరయ్య,కుక్కుడాల మంగమ్మ, దోడ విజయ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో:

ఎన్నికల ముందు ప్రజలకు ఇస్తామన్న ఆరోగ్యారంటీలో వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాసచారి కోరారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రాచకొండ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన 17 మహాసభ లో వారు మాట్లాడారు.రుణమాఫీ కానీ అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలన్నారు.మహాసభ నూతన కార్యదర్శిగా ఉడత గాలయ్య,సహకార దర్శిగా దోనూరు లక్ష్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మహాసభల అపాచీ నాయకులు దోనూరు బుచ్చిరెడ్డి,మారగోన బిక్షం,ఆర్.వెంకటేష్,రొమ్ముల గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రుగొండ గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- **రూ. 2.5 కోట్ల నిధులు మంజూరు**
- **రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి**

నవతెలంగాణ-చివ్వెంల

ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి రూ. 2.5 కోట్లు నిధులు మంజూరు చేశామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాన్ని, పురాతన కట్టడాలను ఆదివారం అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం దేవాలయ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉండ్రుగొండ గుట్టను తెలంగాణలోనే నెంబర్ వన్ టూరిజం స్పాట్‌గా మారుస్తామని వెల్లడించారు. ఉండ్రుగొండ గుట్ట సందర్శనకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల త్యాగాలతో ఎరుపెక్కిన ఎర్రజెండా

- **దాసరి రామకృష్ణ సంతాప సభలో పల్లావెంకట్‌రెడ్డి**

నవతెలంగాణ-గరిడేపల్లి

అమరవీరుల అసమాన త్యాగాలతో ఎర్రజెండా ఎరుపెక్కిందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మండలంలో కల్మల్‌చెరువు గ్రామంలో జరిగిన సీపీఐ నేత దాసరి రామకృష్ణ సంతాప సభకు ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు..తెలంగాణ రాష్ట్రంలో సీపీఐది ప్రత్యేక స్థానమని, నాటి తెలంగాణ సాయుధ పోరాట నుంచి ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ పోరాటం కొరకు జరిగిన అన్ని ప్రజా పోరాటాలలో సీపీఐ పాల్గొన్నదన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం అన్నారు. ఆ లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఏదైనా ఎదుర్కొంటూ ముందుకు సాగుతామని తెలిపారు.ఇటీవల తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలని, అందుకు సీపీఐగా నిర్మాణాత్మక సహకారం అందిస్తామని తెలిపారు.అవసరమైతే ప్రజాఉద్యమం నిర్మించేందుకు వెనకాడ బోమని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గన్నా చంద్రశేఖర్, జిల్లా నాయకులు ధూళిపాళ ధనంజయనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, నాయకులు కడియాలఅప్పయ్య, పందిరినాగయ్య, యల్లబోయినసింహాద్రి,కత్తి శ్రీనివాసరెడ్డి, నంద్యాల రాంరెడ్డి, అమరారపు పున్నయ్య సారెడ్డి పాపిరెడ్డి, ఉప్పతల కోటమ్మ, చిలక రాజు, శ్రీను, అయినాపురం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ పాలకవర్గం విఫలం

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి సలీం**



నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్లగొండ పట్టణంలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ పాలకవర్గం విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి.సలీం ఆరోపించారు. ఆదివారం డాక్టర్స్ కాలనీ 43వ వార్డు సీపీఐ(ఎం) శాఖా మహాసభ సిద్ధార్థ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ పట్టణంలో సుమారు 20వేల మంది ఇండ్లు లేని పేదలు నివసిస్తున్నారని వారికి 120 గజాల స్థలం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి మొత్తం రూ.10 లక్షలు ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆగిపోయిన బస్టాండ్ నుండి స్టేడియం వరకు, అంబేద్కర్ విగ్రహం నుండి బీటీఎస్ వరకు రోడ్డు విస్తరణ పనులు, విలీన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి వెంటనే పనులు పూర్తి చేయాలని, లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులకు వెంటనే స్వాధీన పరచాలని డిమాండ్ చేశారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడం దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభల ప్రారంభానికి ముందు నటరాజ్ థియేటర్ ఎదురుగా పార్టీ జెండాను సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు అనంతరామ శర్మ, రాసమల్ల రామచంద్రం, శాఖ సభ్యులు గడ్డం రాములు, గనిపెల్లి ముత్తమ్మ, భీమనపల్లి అంజయ్యలకు సంతాపం వ్యక్తం చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 43వ వార్డు శాఖ కార్యదర్శిగా కుంభం కృష్ణారెడ్డి మహిళా శాఖ కార్యదర్శిగా కుంభం లక్ష్మమ్మ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 43వ వార్డుసీపీఐ(ఎం) శాఖ సభ్యులు మేక రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు ఊట్కూరి నారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ కమిటీ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, సలివోజు సైదాచారి, శాఖ సభ్యులు గనిపల్లి రాములు, సల్లోజు విష్ణుమూర్తి, మునెమ్మ, లక్ష్మమ్మ రామకృష్ణారెడ్డి, సాకే వెంకటేశ్వర్లు, గడ్డం వెంకన్న, నాయిని నరసమ్మ, చెరుపలి శివమ్మ, వెంకన్న, గొట్టిముక్కుల పుల్లయ్య, రేఖల సుగుణమ్మ, గంట్ల నరసింహ, కత్తుల ముత్తయ్య, కలెట్ల వెంకన్న, బట్టు నిర్మల తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మద్దిరాల

మండలంలోని గోరంట్ల జెడ్పీహెచ్ఎస్ 1997-2001 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించుకున్నారు. గురువులను సన్మానించి స్నేహితులతో ప్రతి ఒక్కరూ తమ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు జలగం మహేష్, కంచం నాగయ్య, రాజబోయిన రాకేష్, వగలగాని మల్లేష్, నలమాస సతీష్, శోభ, సుధారాణి, స్వరూప, పవిత్ర, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలు సంతృప్తిని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి



నవతెలంగాణ-రామన్నపేట

ఉద్యోగ విరమణ అనంతరం చేసే ప్రజాసేవ సంతృప్తిని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జినుకల ప్రభాకర్, గంగుల వెంకట రాజారెడ్డి, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బొడ్డు సురేందర్‌రావు ఆదివారం మండలకేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్ లో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని సురేందర్‌రావు దంపతులను పూలమాలలతో, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో భాగంగా ప్రజలకు చేసే సేవలు ఉద్యోగ విరమణ అనంతరం ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సురేందర్ రావు ఒకవైపు విశ్రాంతి తీసుకుంటూనే మరోవైపు ప్రజాసేవ చేయడం ద్వారా సంతృప్తి తో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని తెలిపారు. ఈ మాత్రం అవకాశం ఉన్న ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేసే దిశగా సాగాలన్నారు. ఈ సందర్భంగా సురేందర్‌రావును స్థానిక నీటిపారుదలా శాఖ అధికారులు, సిబ్బంది, బంధువులు, చిన్ననాటి స్నేహితులు, పూర్వ విద్యార్థులు, అభిమానులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొడ్డు సురేందర్‌రావు మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజలకు, లక్షలదిమంది రైతుల పంట పొలాలకు సాగునీటిని అందించే నీటిపారుదల శాఖలో పనిచేయటమే ఒక అదృష్టమని తెలిపారు.ప్రతి ఒక్కరికి పనిలో అంకితభావం ఉండాలని ఆయన సూచించారు. నాయకులు బందెల రాములు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, సచివాలయ సీనియర్ అసిస్టెంట్ బిపాక యాదయ్య, డాక్టర్ ధనుంజయ, డీఈ నరసింహ, నాయకులు గుత్తా నర్సింహారెడ్డి,గోదాసు పృథ్వీరాజ్, సాల్వేరు అశోక్, ఎండి రెహాన్, సీనియర్ న్యాయవాది యాపాల కృష్ణారెడ్డి, బొడ్డు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ హాల్‌కు మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-నకిరేకల్



లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత స్టడీ హాల్‌కు నకిరేకల్ పట్టణానికి చెందిన సింగరి రాములు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆదివారం ఆయన కుమారుని జ్ఞాపకార్థం కుమారుడు చదువుకున్న పుస్తకాలు మరికొందరికి ఉపయోగపడాలన్న ఆలోచనతో అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉయ్యాల కృష్ణమూర్తికి మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

మండల పరిధిలోని యండ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉయ్యాల కృష్ణమూర్తి మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సోమవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జీడి బిక్షం, ఎండ్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కుంట్ల సుదర్శన్ రెడ్డి, యానాల రామ్ రెడ్డి, పంతంగి శ్రీనివాస్‌గౌడ్, బుడిగె నవీన్ ,మాజీ వార్డ్ మెంబర్లు ఉయ్యాల రవి మూర్తి, అండ్ల పూరి జానయ్య, సూరారపు జానయ్య, ఉయ్యాల సత్యమూర్తి, పంతంగి లింగయ్య, ఉయ్యాల రామకృష్ణ, కాటపల్లి సందీప్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శంకర్ రెడ్డి**

నవతెలంగాణ-మద్దిరాల

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ముకుందాపురం గ్రామంలో జరిగిన సీపీఐ(ఎం) శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. రూ. 500కే గ్యాస్, మహాలక్ష్మి పథకం, రైతు రుణమాఫీ రైతు భరోసా వంటి పథకాల అమలులో ప్రభుత్వానికి తగిన చిత్తశుద్ధి లేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకల నిమిత్తం లింకు రోడ్లు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండల కేంద్రం నుండి ముకుందాపురం, జి కొత్తపల్లి, మామిళ్ళ మడవ పోయే రోడ్డు గుంతల మయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు లేక సతమతమవుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి నేటికీ వాటికీ ఉలుకు పలుకు లేకుండా చేశారన్నారు. వెంటనే పేదలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కల్లేపల్లి భాస్కర్, మండల నాయకులు కోటయ్య, శివరాత్రి మల్లయ్య వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పుల్లయ్య మృతి గౌడ సంఘానికి తీరని లోటు

నవతెలంగాణ-నకిరేకల్



నోముల కల్లుగీత కార్మిక సంఘం సభ్యుడు దిండుగాల పుల్లయ్య మృతి గౌడ సంఘానికి తీరని లోటని గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని నోముల గ్రామంలో పుల్లయ్య భౌతిక కాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుల్లయ్య గౌడ్ కుటుంబానికి తమ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో బాదిని యాదయ్య గౌడ్, ఎల్మకంటి జానయ్య గౌడ్, రాచకొండ పాపులు గౌడ్, ఏర్కలి అంజయ్య గౌడ్, రాచకొండ ముత్యాలు గౌడ్, దిండుగాల గోవింద గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మడివేలు మాచిదేవ జాతర మహోత్సవం

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

మండల కేంద్రంలోరజకలు వారి కుల దైవం మడైలయ్య జాతర మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నల్గొండ జిల్లా శాసనమండలి సభ్యులు ఎంసీ.కోటిరెడ్డి పాల్గొని రజక సంఘం నాయకులు , మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించాలరు. ఈ కార్యక్రమంలో అల్లిపెద్దిరాజు యాదవ్, బీవి రమణ రాజు ,నాగేండ్ల వెంకట్ రెడ్డి, రాంబాబు, పాతన పోయిన భాస్కర్, చంద్రయ్య, చిన్న పుల్లయ్య, వనమాలు, పాతనబోయిన సురేష్, రంగయ్య రాంబాబు, నాగేశ్వరరావు, ప్రశాంత్, రమేష్, రజక సంఘం మహిళ నాయకురాలు ఎల్లమ్మ, నాగమ్మ, లలిత, రజక సంఘం యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నకిరేకల్



పట్టణంలోని శివరంజని విద్యా మందిర్ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 2002-03బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. 21 ఏళ్ల తరువాత కలుసుకొని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయంలో స్థిరపడిన ఆనాటి పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శివరంజని విద్యా మందిర్ కరస్పాండెంట్ భూపతి సత్తయ్య, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు చెగోని శీను, చేగోని నరేందర్, పోతుల వెంకన్న, తండు వెంకన్న, కొండ కవిత, సునీత, నవ్య, స్వర్ణలత ఏడాకుల సంతోష్, చేగోని శ్రవణ్, మల్లేష్ ,మహేష్, రాజు సైదులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేని పాలన ఎలా...?

- ఇబ్బందుల్లో పంచాయతీ కార్యదర్శులు
- పండుగకు పైసలు లేవు
- సొంతంగా ఎంతకాలం ఖర్చు భరించాలని ఆవేదన
- జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



'దేశానికి పల్లెలే పటుగొమ్మలు'అన్న గాంధీజీ నినాదం నిజమే అయినప్పటికీ, పల్లెల్లో ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడంతో పరిపాలన కుంటుపడింది. సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి ఒకటిన ముగియడంతో, ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారి పరిపాలన ప్రారంభమైంది.

నిధులు లేని పాలన ఎలా...

కాగా గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో నిధులు లేకుండా పంచాయతీ నిర్వాహన తలకు మించిన భారంగా మారిందని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారుల మాటలకు అడ్డు చెప్పలేక, ఇటు కింది స్థాయిలో పారిశుద్ధ నిర్వాహన పనులు పూర్తిస్థాయిలో చేయలేక సతమతమవుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయతీలు...

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలకు గాను 421 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు పాలన కొనసాగించడానికి, ముఖ్యంగా దసరా పండుగ సీజన్ కావడంతో గ్రామాల్లో వీధిదీపాల ఏర్పాట్లు, పారిశుధ్యం నిర్వహణ చేయలేక ఆర్థికంగా అప్పుల పాలవుతున్నారు.

2022 నవంబర్ నుంచి రాని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు...

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంబంధించిన రాకపోవడంతో కారణమైతే, పంచాయతీ ప్రజాప్రతినిధుల కాలం ముగిసిన ఆరు నెలలు ఎన్నికలు నిర్వహించకపోవడంతో సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు రాకపోవడం మరొక కారణం. కాగా చివరిసారిగా సెంట్రల్ ఫైనాన్స్ నిధులు జనవరిలో వచ్చాయి. ప్రభుత్వ సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధులు రావడంలేదని అధికారులు వాపోతున్నారు.

నిలిచిపోయిన పనులు...

గ్రామపంచాయతీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో గ్రామపంచాయతీ ఖజానాలో నిధుల కొరత ఏర్పడింది. కార్యదర్శులు ప్రతినెల ట్రాక్టర్ ఇన్స్టాల్మెంట్ , డీజిల్ ఖర్చు, పారిశుధ్య నిర్వహణ, పైపులైన్ మరమ్మతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో నిధులు లేకపోవడంతో కార్యదర్శులు తప్పనిసరి పరిస్థితులలో అప్పులు చేసి మరి గ్రామపంచాయతీ భారాన్ని మోయాల్సి వస్తుంది. అటు ప్రభుత్వం నుంచి నిధులు రాక, ప్రత్యేక అధికారులు పట్టించకపోవడంతో అడకత్తెరలో పోక చెక్కల పంచాయతీ కార్యదర్శులు నలిగిపోతున్నారు. కాగా దసరా పండుగ రావడంతో పండగ ఏర్పాట్ల కోసం పరిశుద్ధ పనులు నిర్వహించలేని అయోమయ పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులు కొట్టుమిట్టాడుతున్నారు.

గ్రామ పంచాయతీకి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది...

మేజర్ గ్రామపంచాయతీలకు నిర్వహణ కోసం పంచాయతీ కార్యదర్శులు లక్ష రూపాయల నుంచి సుమారు 3 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రెండేండ్లుగా రాకపోవడం, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ నిర్వాహణ కోసం కార్యదర్శులు అప్పులు చేసి పంచాయతీ పాలన కొనసాగిస్తూ, ఇటు కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నా.



పింఛన్‌దారులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

పింఛన్‌దారులను ప్రభుత్వం మోసగిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ విమర్శించారు.మండలంలోని చిన్న కొండూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో 18వ మహాసభ చింతల సుదర్శన్ అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఆసరా పింఛన్లు,రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు రూ.4000 ఉన్న పింఛన్ రూ.6000 చేస్తామని కాంగ్రెస్ ప్రజలకు ఆరు హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆసరా పింఛన్లు రాక ఎంతోమంది పేద మధ్యతరగతి కుటుంబాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.పలు హామీలు ఇచ్చారు కానీ నేటికీ అమలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇచ్చిన హామీలను పరిష్కరించాలని, పరిష్కరించని ఎడల పెద్ద ఎత్తున ప్రజల తరఫున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్,బోయ యాదయ్య ,కొండే శ్రీశైలం, జక్కిడి రాంరెడ్డి,ఎలకరాజు యాదగిరి, చింతపల్లి నరసింహారెడ్డి,గడగోట్టి జంగయ్య, తూర్పునూరు జంగయ్య,చీమకుండ్ల శ్రీరాములు, చెరుకు రమేష్, ఎస్.కె ఇబ్రహీం, గరెస్ నరసింహ తిగుళ్ల మల్లయ్య, తిగుల్ల రమేష్,రాపోతు పద్మ, అవనగంటి యాదమ్మ, మాంద్ర కోటయ్య, గర్నే లింగస్వామి, పొట్ట సాయి, నత్తి నరేష్, చెక్క శ్రీను,తిగుళ్ల శ్రీను పాల్గొన్నారు.

30 రకాల ప్రభుత్వ పథకాలకు ఒకటే ఫ్యామిలీ డిజిటల్ కార్డు..!

- నేటి తో పైలెట్ ప్రాజెక్టు సర్వే ముగింపు
- చండూర్ ఆర్డీవో సుబ్రహ్మణ్యం

నవతెలంగాణ-చండూరు



30 రకాల ప్రభుత్వ పథకాలకు ఒకటే డిజిటల్ కార్డును ప్రభుత్వ రూపొందిస్తుంది. ఇందులో భాగంగా నియోజవర్గానికి ఒక గ్రామం, మున్సిపాలిటీలో ఒక వార్డును ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టు కింద సర్వేను మొదలుపెట్టింది. సర్వే విజయవంతంగా ముగిసిన తర్వాత లోటుపాటలు ఏమైనా ఉంటే సరిచేసి ఆ తర్వాత అంతటా డిజిటల్ కార్డు నమోదు సర్వేను ప్రభుత్వం చేపట్టనుంది. చండూరు మున్సిపాలిటీకి సంబంధించి మూడో వార్డులో సర్వే 382 కుటుంబాలకు గాను 370 కుటుంబాలకు సర్వే పూర్తయ్యాయి. ఇంకా 12 కుటుంబాలు సర్వే చేయాల్సి ఉంది. నేటి తో సర్వే పూర్తి చేస్తామని, కొంతమంది హైదరాబాదులో ఉన్నట్లు వారికి సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెప్పుకొచ్చారు. ఇంతకాలం రేషన్ కార్డు వుంటే ప్రభుత్వం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించేది. ఆరోగ్య శ్రీ కార్డు వుంటే వైద్యం కోసం ప్రభుత్వం సాయం చేసేది. ఇక రైతు బీమా, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ వంటి ప్రభుత్వ పథకాలు పొందాలంటే అనేక పత్రాలు అవసరమయ్యేవి. ఈ పద్ధతిని మార్చి అటు ప్రజలు, ఇటు పాలకులకు సౌకర్యవంతంగా వుండే విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తోంది. ప్రభుత్వం ఒక్కటే, కుటుంబమూ ఒక్కటే ... కానీ వేరువేరు శాఖలు వివిధ పథకాల కోసం సమాచారం సేకరించేవి. ఇప్పుడలా కాదు... ప్రభుత్వం ఒకేసారి ఆ కుటుంబం వివరాలను సేకరిస్తుంది. అన్ని వివరాలతో కూడిన ఓ డిజిటల్ కార్డును కేటాయిస్తుంది. తద్వారా ఒక్క క్లిక్ తో ఆ కుటుంబ సభ్యుల వివరాలు ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తాయి. కాబట్టి ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగడం...లేదంటే ప్రతిసారి అధికారులు ప్రజలవద్దకు వెళ్లి వివరాలు సేకరించే బాధ తప్పుతుంది. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివరాలు అన్ని ప్రభుత్వ శాఖలకు అందుబాటులో వుంటాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం అందించే దాదాపు 30 రకాల పథకాలు, సేవలకు ఈ డిజిటల్ కార్డు కీలకం కానుంది. ఇలా వన్ నేషన్ వన్ రేషన్ మాదిరిగానే 'వన్ స్టేట్ వన్ కార్డు' విధానాన్ని తీసుకువస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డే ఇక రేషన్, పెన్షన్, రైతు భరోసా, రైతు భీమా కార్డు... ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళల ఉచిత ప్రయాణం , 500 రూపాయల సిలిండర్ల వంటి పథకాలకు ఇదే అర్హత. ఇప్పుడు సేకరించే సమాచారం ప్రతి ప్రభుత్వ శాఖకు అందుబాటులో వుంటుంది...తద్వారా ఏ పథకానికి ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అన్నది ఈజీగా గుర్తించవచ్చు. ఇంట్లో పెళ్లయి కొత్త కోడలు వచ్చినా లేదా అమ్మాయి మరో ఇంటికి వెళ్లినా ఆ వివరాలను వెంటనే కంప్యూటరైజ్ చేసి ఫ్యామిలీ డిజిటల్ కార్డులో నమోదు చేస్తారు. అలాగే కుటుంబంలో పెద్దవాళ్లు చనిపోయినా ఆ వివరాలను ఫ్యామిలీ కార్డులో నమోదవుతాయి. కాబట్టి ఇప్పుడున్న రేషన్ కార్డులా ప్రతిసారి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వివరాలు సవరించుకోవాల్సిన అవసరముండదు.





పలువురి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాంపల్లి

ఇటీవల మృతి చెందిన నాంపల్లి మాజీ జెడ్పీటీసీ, మాల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కర్నాటి రామలింగం, మండలంలోని తుమ్మలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దండిగ వెంకటయ్యల కుటుంబ సభ్యులను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతుల ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మాజీ జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి, నార బోయిన రవి, పూల వెంకటయ్య, పానుగంటి వెంకన్న, పెద్దిరెడ్డి రాజు, దండిగ నరసింహ, సయ్యద్ గఫార్, నేతాల కొండల్, అన్నెపాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం జరుగుతుందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు .రెండ్రోజుల కింద ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.ఈడబ్ల్యూఎస్ అంటే ఉన్నత కులాల్లో ఆర్థిక వెనకబాటు ఆధారంగా విద్యా, ఉద్యోగాల్లో వీరికి మొత్తంగా ఉద్యోగాల్లో 10 శాతం ఇస్తున్నారని తెలిపారు.సమాజంలో 6 శాతం ఉన్న 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సరికాదన్నారు.వెంటనే సీఎం పునర్ పరిశీలించి ఈడబ్ల్యూఎస్ ప్రక్రియను అగ్రకులాల్లో ఉన్న పేదలకే అమలు జరిగేలా చూడాలని కోరారు.బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 60 శాతం రిజర్వేషన్లు ప్రకటించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, మహేందర్ పాల్గొన్నారు.

రెండు దశాబ్ధాలు పూర్తవుతున్నా పూర్తికాని ధర్మారెడ్డిపల్లి కాలువ

- నిదులు విడుదల చేసి కాల్వ పూర్తి చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి

నవతెలంగాణ-రామన్నపేట



ధర్మారెడ్డిపల్లి కాల్వ తవ్వకం పనులు ప్రారంభమై రెండు దశాబ్దాలు దాటుతున్న నేటికీ కాల్వ పూర్తి చేయకపోవడం బాధాకరమని రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి విమర్శించారు. మండలములోని సిరిపురం గ్రామంలో ఆపార్టీ గ్రామ శాఖ 14వ మహాసభ నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21ఏండ్ల కింద ప్రారంభమైన ధర్మారెడ్డి పల్లి కాలువ ఏండ్లు గడుస్తున్న పూర్తి కావడం లేదన్నారు.కాంట్రాక్టర్లు ప్రభుత్వ అధికారులు లబ్ది పొందుతున్నరు తప్ప రైతాంగానికి ఉపయోగం జరగలేదని విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ కొంతమందికి నష్ట పరిహారం అందలేదని, అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి ధర్మారెడ్డి పల్లి కాలువ పై బిడ్జిలు, కల్వర్టులు నిర్మించి, కాలువను పూర్తి చేసి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తుమ్మలగూడెం నుండి వయా సిరిపురం వెలిమినేడు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, అత్యధికంగా చేనేత కార్మికులు అధికంగా ఉన్న సిరిపురం గ్రామంలో ప్రభుత్వం త్వరలో ఉపాధి కల్పించేందుకు చేనేత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.నాయకులు అంబటి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జలల పెంటయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యుడు అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ మిర్యాల భాస్కర్, పాలసంఘం చైర్మెన్ బలుగూరి ఉపేందర్, నాయకులు దోమలపల్లి నర్సింహ, రాపోలు ప్రభాకర్, కూనూరు వెంకటేష్, దాడి మల్లారెడ్డి, భారత మృత్యుంజయ, కునూరు గణేష్,గాదె కృష్ణ, గుంజే సైదులు, మార్త భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిబొలుగురి నరసింహ

నవతెలంగాణ-నాంపల్లి



ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రవేశపెటిబడ్జెట్లో కేవలం 70 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉపాధి హామీకి 2.70.000 కేటాయించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు పెంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 700 రూపాయలు రోజువారి కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరె సత్తయ్య, మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఊశయ్య, మండల సహాయ కార్యదర్శి ఊరుపక్క వెంకటయ్య, ఉపాధ్యక్షులు కాయాతి వెంకన్న, బుషిపాక ప్రశాంత్, ఇరిగి సంజీవ, జిల్లా బాలకృష్ణ, నేరెళ్ల సైదయ్య సభ్యులు, రేవెల్లి అంజయ్య అంజయ్య నర్సింహ, జిల్లా శేఖర్, మల్లేష్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట రైల్వే స్టేషన్‌లో రైళ్లను ఆపాలని వినతి

నవతెలంగాణ-రామన్నపేట



రామన్నపేట రైల్వేస్టేషన్‌లో అన్ని రైలు ఆపేలా చూడాలని కోరుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కరోనాకు ముందు రామన్నపేట రైల్వేస్టేషన్‌లో నారాయణద్రి, ఫలక్నామా, జన్మభూమి, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవని, అవి ఆగకపోవడం మూలంగా ఎక్కడి ప్రజలు, వ్యాపారులు,వలస కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు రామన్నపేట పాత అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం, పాత తాలూకా కేంద్రం అయినా రామన్నపేట చేనేత వస్త్రాల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిందన్నారు.ఇక్కడి రైల్వేస్టేషన్ నుండి ప్రజలు హైదరాబాద్, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారన్నారు. కేవలం జన్మభూమి, రేపల్లె రైళ్లు మాత్రమే ఆపుతున్నారన్నారు.పరిసర మండలాలలోని భక్తులు తిరుపతి వెళ్లడానికి నల్లగొండ లేదా హైదరాబాద్‌కు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తుందన్నారు. చిట్యాల, చౌటుప్పల్, రామన్నపేట మండలాలలోని పరిశ్రమలలో, భవన నిర్మాణ రంగ కూలీలు బీహార్, జార?ండ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ ఛత్తీస్గడ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. వారు తమ ప్రాంతాలకు వెళ్లి రావడానికి ఫలక్నామా ఎక్స్ప్రెస్ ఇతర రైలు సౌకర్యంగా ఉంటుందన్నారు.ఆ రైళ్లను ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



దసరా కానుకగా డీఏ, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్ నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజాపాలన ప్రజా ప్రభుత్వంలో దసరా కానుకగా ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావల్సిన డీఏ బకాయిలు ఐదు,పెండింగ్‌లో ఉన్న మెడికల్,వార్షిక ఇంక్రిమెంట్,ఇతర పెండింగ్ బిల్లులు అన్నింటినీ ప్రభుత్వం మంజూరు చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరత్ నాయక్ కోరారు.ఆదివారం మిర్యాలగూడలో అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వం ఉద్యోగులను చిన్నచూపు చూసిందని వారికి రావల్సిన డిఏ,ఇతర బకాయిలు పెండింగ్ లో పెట్టిందని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వంపై ఉద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారని రానున్న దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని బకాయి డీఏ లు,ఇతర పెండింగ్ బిల్లులు మంజూరు చేసి ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వంగా పేరుగడించాలని ఆకాంక్షించారు.ఈ విషయమై సీఎం ఒకటి, రెండు రోజుల్లో మంత్రిమండలిలో చర్చించి ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్, శ్రీను, వెంకన్న, మోతీలాల్, లాలు, మక్ల, సైద, జంలా తదితరులు ఉన్నారు.

దొంతగాని శైలజ కుటుంబానికి ఆర్థిక సహాయం



మాదుగులపల్లి : మండలంలోని పాములపహాడ్ గ్రామానికి చెందిన దొంతగాని శైలజ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ క్రింద పడి మరణించింది.ఆదివారం ఆమె దశదిన కార్యక్రమం పాములపహాడ్ లో వారి ఇంటివద్ద జరిగింది.ఈ సందర్భంగా తనతో పాటు కలిసి ఆగామోత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పదవ తరగతి స్నేహితులు పాల్గొని శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ఆర్థిక సహాయం నిమిత్తం పదవ తరగతి బ్యాచ్ తరుపున కలెక్ట్ చేసిన డబ్బులు రూ. 27,000లను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం దొంతగాని శైలజ కుమారుడు, కుమార్తెలకు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పతాని శ్రీను, భూపతి సురేష్, పున్నా రాకేష్, జాల సైదులు, ప్రియాంక, శైలజ, శంకరమ్మ, లలిత, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.